


# ఓట్లు అక్కడా.. ఓటర్లు ఇక్కడా..



హైదరాబాద్ వార్త

గెలుపోటములపై ప్రభావం..

హైదరాబాద్‌లో నివాసం ఉండే మునుగోడు నియోజకవర్గ ఓటర్లు అక్కడ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపోటములను ప్రభావితం చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఉప ఎన్నికల్లోన వీరు కీలకంగా మారారు. దీంతో మూడు ప్రధానపార్టీలు ఈఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మేరకు ఇప్పటికే గ్రామాల వారిగా హైదరాబాద్‌లో నివసించే ఓటర్లను గుర్తించి వారిని కలిసి ఓటు అభ్యర్థించే విధంగా ఏరియాల వారిగా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. వారురోజూ ఎల్బీనగర్, సాగర్‌రోడ్‌లలోని హోటళ్లలో ఉంటూ ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. దూరంగా ఉన్న ఓటర్లతో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఓటింగ్ రోజు వరకు మిమ్మల్ని అన్నిరకాలుగా చూసుకునే బాధ్యత మాది అని చెబుతున్నారు. అలాగే సమీపంలోని హోటళ్లు, పంక్షన్‌హాల్స్‌లో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసి మందు, విందుతో దావత్‌లు ఇస్తున్నారు.

- "పట్నం"లో మునుగోడు ఉప ఎన్నిక సందడి
- ఎల్బీనగర్, ఇంబ్రహీంపట్నం పరిధిలో పెద్దఎత్తున ఓటర్లు
- ప్రాంతాల వారిగా విభజించి.. ఇంచార్జ్‌లను నియమించిన పార్టీలు
- ఓటర్లను గ్రామాల్లోకి తరలించేంత వరకు బాధ్యతలు
- ఆకట్టుకునేందుకు రోజూ దావత్‌లు, ఆత్మీయ సమ్మేళనాలు
- అభ్యర్థుల గెలుపోటముల్లో వీరే కీలకంగా మారే అవకాశం




హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: మునుగోడు నియోజకవర్గం రాజధాని హైదరాబాద్ చేరువలో ఉన్నా పెద్దగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఉపాధి కోసం మునుగోడు నుంచి వేలాదిమంది నగరానికి వలసబాట పట్టారు. విద్యార్థులు చదవుకునేందుకు సరైన విద్యాసంస్థలు కూడా లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ దృష్ట్యా హైదరాబాద్‌కు చేరుకుని నివాసం ఏర్పరుచుకున్నారు. మునుగోడు నియోజకవర్గంలోని దాదాపు 2లక్షల 40వేల పైచిలుకు ఓటర్లలో 10నుంచి 15శాతం మంది ఇతరప్రాంతాల్లోనే ఉంటున్నారు. వీరిలో హైదరాబాద్‌లోనే 25వేలమందిపైగా ఉన్నట్లు సమాచారం. ఉదాహారణకు మునుగోడు నియోజవకవర్గంలోని గట్టుప్పల్ మండల కేంద్రంలోని రెండు ఎంపిటిసిల పరిధిలో 5288 ఓట్లు ఉండగా 1800ఓట్లు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. అదేమండలానికి చెందిన తేరటపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో 2211ఓట్లు ఉండగా అందులో 520మంది హైదరాబాద్‌లో ఉంటున్నారు. అలాగే సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాకలో 3751ఓట్లు ఉండగా ఇందులో 700వరకు నగరంలో ఉన్నారు. ఇలా నియోజకర్గంలోని ఒక్కోగ్రామ పంచా యితీ పరిధి లోని ఓటర్లలో దాదాపు 200 నుంచి 600వరు హైదరాబాద్‌లోనే ఉన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్‌తోపాటు, సరూర్‌నగ్, దిల్‌షుఖ్‌నగర్, ఉప్పల్, హాయత్ నగర్, పెద్దఅంబర్‌పేట్, బిఎన్‌రెడ్డి, వనస్థలిపురం, కర్మన్‌ఘాట్, రామాం తపూర్, అంబర్‌పేట్, బోడుప్పల్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు.

## ఆసుపత్రి ముందు ఉన్న కారులో బ్యాగు చోరీ

### డ్రైవర్ అరెస్టు.. 12లక్షల సొత్తు స్వాధీనం



నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న డిసిపి శిల్పావల్లి

గచ్చిబౌలి, అక్టోబరు 29 ప్రభాతవార్త : ఆసుపత్రి ముందు నిలిపి ఉంచిన కారులో నుంచి బ్యాగు చోరీ చేసి అందులో ఉన్న 12లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేసిన డ్రైవర్‌ను మాదాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గచ్చిబౌలి డిసిపి కార్యాలయంలో డిసిపి శిల్పావల్లి శనివారం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కావలి ట్రంకు రోడ్డు బృందావన్ కాలనీలో నివాసం ఉండే రియల్ ఎస్టేట్ వ్యాపారి కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి తన భార్య శ్రీలతతో కలిసి నగరంలోని తన సోదరుడి ఇంటికి దీపావళి పండుగ వేడుకల కోసం వచ్చాడు. తిరిగి సొంత గ్రామానికి వెళ్లే క్రమంలో ఈనెల 27వ తేదీన ఉదయం 10 గంటల ప్రాంతంలో మాదాపర్‌లోని యశోద ఆసుపత్రిలో తన భార్యను హెల్త్‌చెకప్ చేయించేందుకు వచ్చాడు. ఆసుపత్రి లోపలికి వెళ్తే సమయంలో తన ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలను శ్రీలత బ్యాగులో పెట్టి తమ కారు 10(ఎపి39 ఎంహెచ్5409)లో ఉంచింది. కాగా కారు డోర్ గ్లాసును మొత్తం క్లోజ్ చేయకుండా మరిచిపోయారు. తిరిగి వచ్చి కారులో బ్యాగు కోసం గాలించగా, కనిపించలేదు. బ్యాగులో ఉన్న రెండు బంగారు బిస్కెట్లు, రెండు బంగారు చేతి గడియారాలు, డాలర్, నక్లెస్, గోల్డ్ చెయిన్‌లు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో వారు మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టడంతో పాటు సిసి కెమెరాలను పరిశీలించారు. యశోద ఆసుపత్రిలోనే డాక్టర్‌గా పనిచేస్తున్న విజయ్ మోహన్ వద్ద షాలిబండ చార్మినార్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఖాన్(37) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డాక్టర్‌ను తీసుకొని 27వ తేదీన ఉదయం యశోద ఆసుపత్రికి వచ్చిన ఇమ్రాన్ ఖాన్ తిరిగి వెళ్లే సమయంలో జగదీశ్వర్‌రెడ్డి కారు గ్లాస్ తెరిచి ఉండడం గమనించాడు. వెంటనే గ్లాసులో నుండి చెయ్యి పెట్టి డోర్ లాక్ తీసి కారులో వెదికాడు. కారులో బంగారు ఆభరణాలతో ఉన్న బ్యాగు కనిపించడంతో దాన్ని చోరీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించగా, ఇమ్రాన్‌ఖాన్ చోరీ విషయం తెలిసింది. దీంతో ఇమ్రాన్‌ఖాన్‌ను ఆరెస్టు చేసిన పోలీసులు అతని వద్ద నుంచి 12లక్షల విలువైన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## 'బ్నిం కార్టూన్లు' పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త: గొప్ప రచయిత బ్నిం అని ప్రముఖ సినీనటులు, రచయిత, దర్శకులు తనికెళ్ల భరణి అన్నారు. ఎంవిఆర్.ఫౌండేషన్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, కార్టూనిస్ట్, హంసఅవార్డుగ్రహీత, కళారత్న బ్నిం రచించిన 'బ్నిం కార్టూన్లు' పుస్తకావిష్కరణ సభ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో ఫౌండేషన్ అధినేత మట్టిగుంట వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా తనికెళ్ల భరణి హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో వల్లీశ్వర్, ప్రముఖ కార్టూనిస్ట్ శంకు, ప్రముఖ దర్శకులు శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పుస్తకాన్ని 'అక్షజ' ప్రచూరించింది.

## గాజులరామారంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



జీడిమెట్ల, అక్టోబర్ 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ పరిధి గాజులరామారం గ్రామ ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను శనివారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సర్వే నెంబర్ 342 ప్రభుత్వ భూమిలో అక్ర మంగా నిర్మించిన 12 గదులను, సర్వే నెంబర్ 329 ప్రభుత్వ భూమిలోని 4గదులను రెవెన్యూ అధికారుల సమక్షంలో కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.

### ఆర్టీసి సంస్థను లాభాల బాటలో తెచ్చేందుకు ఉద్యోగులు
## సమిష్టిగా పనిచేయాలి : డిఎం రాంమోహాన్



ఈపికె, ఇంధనం పొదుపులో సాధించిన డ్రైవర్,కండక్టర్లను అభినందిస్తున్న డిఎం రాంమోహాన్

కంటోన్మెంట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: ఆర్టీసి సంస్థను లాభాల బాటలో తెచ్చేందుకు కండక్టర్, డ్రైవర్లు సమిష్టిగా పనిచేయాలని కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్. రాంమోహాన్ తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలో ఇంధనం పొదుపులో, అత్యధిక ఆదాయం ఈపికె తెచ్చిన డ్రైవర్, కండక్టర్లకు ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డిఎం రాంమోహాన్ మాట్లాడుతూ ఇంధనం పొదుపు చేయడంలో డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలన్నారు. అదే విధంగా ఒక్కొక్క స్టేజీలో ప్రయాణికులను అదనంగా బస్సులో ఎక్కించుకోవాలన్నారు. టీఏవైఎల్ టికెట్లు అత్యధికంగా అమ్మాలని సూచించారు. ఈ సందర్భంగా 18 మంది కండక్టర్లను, 6 మంది డ్రైవర్లకు పారితోతకం అంద జేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సుఖేందర్ రెడ్డి, టీఐ-2 నర్సింహ్మా, కంట్రోలర్లు కసిరెడ్డి నర్సింహ్మారెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ జోడో యాత్రకు విశేష స్పందన



భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదల్ అడిసనల్ చీఫ్ మహ్మద్ వాజిద్ పాషా

యసూనుఫ్ గూడ, అక్టోబర్ 29, ప్రభాతవార్త : దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి భారత్ జోడో యాత్రకు విశేష స్పందన లభిస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదల్ అడిషనల్ చీఫ్ మహ్మద్ వాజిద్ పాషా అన్నారు. మహబూబ్ నగర్‌లో నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ పాదయాత్రలో మోతీనగర్ నుంచి మహ్మద్ వాజిద్ ఫాషా ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు తరలివెళ్ళి మద్దతు తెలిపారు.

## దక్షిణాది ప్రజల హక్కులపై మాట్లాడితే కేసులు పెడతారా..?

ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాలు, హక్కులపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ఆంధ్రా మేధావుల ఫోరం నాయకుడు చలసాని శ్రీనివాస్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దక్షిణాధి రాష్ట్రాలకు ఉత్తరాది పాలకులు చేస్తున్న అన్యాయాలను ఏకరువు పెట్టారు. దక్షిణాధి రాష్ట్రాల నుంచి వస్తున్న పనులను ఉత్తరాధికి తరలిస్తూ ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కుతో కేంద్ర ప్రభుత్వం దక్షిణాధి ప్రాంతానికి చెందిన అన్యాయాలను మాట్లాడినందుకు ఎలా కేసులు పెడతారని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు ఐటిఐఆర్ ప్రాజెక్ట్ కేటాయించకుండా, తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించి తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## దృష్టి మరల్చి దోపిడీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు




వివరాలను వెల్లడిస్తున్న ఎసిపి శివమారుతి

మెహిదీపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త : వృద్ధులను, అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఏటీఎం సెంటర్ల వద్ద అటెన్షన్ డైవర్షన్ చేస్తూ దోపిడీలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను ఆసిఫ్‌నగర్ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఆసిఫ్‌నగర్ ఏసిపీ శివ మారుతి వివరాలను వెల్లడించారు. బీహార్, గయా డిస్ట్రిక్ డూమ్రి విలేజ్‌కు చెందిన అటుల్లా ఖాన్ అలియాస్ ధనూష్ (28), ఫతేపూర్ గయా డిస్టిక్ చెందిన సురేందర్ కుమార్ (33) అదే ప్రాంతానికి చెందిన బీరు పాండే ఈ ముగ్గురు కలిసి దేశంలోని పలు ప్రాంతాల్లో పలు ఏటీఎం సెంటర్లకు వచ్చిన వృద్ధులు, అమాయకులను దృష్టి మళ్లించి వారి ఏటీఎం కార్డు తీసుకుని డబ్బులు తీసి ఇస్తామని చెప్పడంతో పాటు ఏటీఎం కార్డు నెంబరు నొక్కి డబ్బులు రాకుండా ముందస్తుగానే ఏటీఎం సెంటర్‌లలో ఫెవికాల్ పెట్టి పనిచేయకుండా చేయడంతో డబ్బులు రాకపోవడంతో డబ్బులు రావడం లేదు అని మాటల్లోదింపేవారు. వారు వెళ్లిన వెంటనే డబ్బులు డ్రా చేసుకుని వెళ్లేవారు. అయితే అమాయకులను నుంచి ఏటీఎం కార్డు తీసుకుని గుర్తు పట్ట కుండా అదే కలరున్న ఏటీఎం కార్డును ఇచ్చి పంపేవారు. వారు వెళ్ళిన వెంటనే ఏటీఎం కార్డు పిన్‌కోడ్ నెంబర్ గుర్తుపెట్టుకుని బ్యాంకుల్లో ఉన్న డబ్బులన్నీ కాళీ చేసేవారు. ఈ రకంగా నగరంలోని సుమారు పది పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదైనట్లు ఏసిపి తెలిపారు. ఈ ముఠాకు చెందిన ఇద్దరి వద్ద రెండు లక్షల యాబైవేల రూపాయలు నగదుతో పాటు 115 వివిధ బ్యాంకులకు సంబంధించిన ఏటీఎం కార్డులు, ఒక స్వైపింగ్ మిషన్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసూకున్నారు. నిందితులలో పాండే పరారీలో ఉన్నాడని పోలీసులు అతన్ని పట్టుకోవడా న్ని ముమ్మరంగా గాలిస్తూన్నారని ఏసిపి శివ మారుతి తెలిపారు. సికింద్రాబాద్ లోని లాడ్జిలో ఉన్నట్టు ఈ కార్యకలాపాలను నడిపిస్తూన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును చేదించడానికి సీసీ టీవి ఫూటేజిలు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపారు. కేసును చేదించిన ఇన్‌స్పెక్టర్ సిహెచ్. శ్రీనివాస్, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ తేజ్‌తో పాటు క్రైమ్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

## మంత్రముగ్ధులను చేసిన నృత్యార్పణం



కళాకారుల నృత్యార్పణంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, అక్టోబరు 29 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, ప్రముఖ సంప్రదాయ కూచిపూడి నృత్యశిక్షణా సంస్థ నృత్యదీక్షాలయ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నృత్యార్పణం పేరున కూచిపూడి నృత్యోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగి ఆహుతులను మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరి కృష్ణ, కళారత్న నృత్యప్రియ, సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీశంకర్ తదితరులు పాల్గొని జ్యోతిప్రకాసనం చేసి నృత్యార్పణంను ప్రారంభించారు. నృత్య దీక్షాలయ గత నాలుగు సంవత్సరాలుగా తమ విద్యార్థుల కు కూచిపూడి నృత్యంలో సంపూర్ణ శిక్షణ ఇచ్చి మంచి కళాకారులుగా తీర్చిదిద్దడంతో ఎన్నో వినూత్నరీతిలో నృత్యప్రదర్శనలను ఇచ్చే అవకాశం కల్పించి ప్రోత్స హించడం హర్షదాయమని సంస్థ కళాసేవలను కొని యాడారు.

### కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను
## పర్మినెంట్ చేసేంత వరకు ఉద్యమిస్తాం

**తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ హెచ్చరిక**

సైఫాబాద్, అక్టోబరు 29 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న శానిటేషన్, పెషెంట్ కేర్, సెక్యూరిటి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివొ నెంబరు 21 ప్రకారం వేతనాలు 19 వేలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్ చేసింది. అలాగే ప్రస్తుతం అమలు జరుగుతున్న జివొ నెంబరు 60, డిఎంఈ సర్కులర్ ప్రకారం 12,093 రూపాయలు చెల్లించాలని యూనియన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసఫ్, ఎం.నర్సింహా కోరారు. లేని పక్షంలో ఈ నెల 18న ఇందిరాపార్కు ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని శనివారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు హెచ్చరించారు. కరోన కష్టకాలంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, థర్డ్ పార్టీ సిబ్బంది, స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్లు, వార్డు బాయ్స్, స్వీపర్లు, సెక్యూరిటి గార్డులు ప్రాణాలకు తెగించి ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేశారని, వీరిని పర్మినెంట్ చేసేంతవరకు యూనియన్ ఉద్యమిస్తుందని ఇటీవల మహ బూబ్‌నగర్‌లో జరిగిన యూనియన్ 3వ మహా సభలలో తీర్మానించడం జరిగిందని తెలిపారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఆసుపత్రులలో రోగులకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని, కార్మికులపై కాంట్రాక్టర్ల దోపిడిని అరికట్టాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలని మహాసభలో తీర్మానించడం జరిగిందని వారు వివరించారు.

**మెడికల్ యూనియన్ నూతన కార్యవర్గం..**

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం.డి.యూసఫ్, ఎం.నర్సింహా ఏకగ్రీవంగా మహా సభలలో ఎన్నికైనారు. కార్యనిర్వాహక అధ్యక్షురాలుగా ఎం.లక్ష్మీబాయి, ఉప ప్రధాన కార్యదర్శిగా హసీనాబేగం, ఉపాధ్యక్షులుగా ఎం.సత్యం, బి.వెంకటరాజ్యం, టి.నర్సింహ్మారెడ్డి, గన్నారపు రమేష్, కార్యదర్శులుగా పళ్ల దేవేందర్‌రెడ్డి, సిర్రా దేవేందర్, పి.మల్లేష్, ఓమయ్య, జె.లక్ష్మి, ఎస్.కిష్టమ్మల తోపాటు మొత్తం 65 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని ప్రధాన కార్యదర్శి తెలిపారు.

## 2017 బ్యాచ్ స్కాలర్స్‌కు సబ్మిషన్ తేదీని పొడగించాలి



ఓఎస్డీ రెడ్యానాయక్‌కు వినతిపత్రాన్నిఅందజేస్తున్న పరిశోధన విద్యార్థులు

తార్నాక, అక్టోబర్ 29 ప్రభాతవార్త: 2017 బ్యాచ్ స్కాలర్స్‌కు సబ్మిషన్ తేదిని పొడగించాలని ఓఎస్డీ ప్రొ. రెడ్యానాయక్‌కు రిస్కర్చ్ స్కాలర్లు వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా కోవిడ్ కాలంలో స్కాలర్స్ కోల్పోయిన అకాడమిక్ ఇయర్‌ను పరిగణలోని తీసుకొని థీసిస్ సబ్మిషన్ కోసం రెండు సంవత్సరాల సమయం ఇవ్వాలని, రీసర్చ్ గైడ్‌ను మార్చుకొనుటకు వీలుగా ఒక సంవత్సర కాలపరిమితి నిబంధనను మినహాంచాలని, రీసర్చ్ డిజైన్ సెమినార్‌కి విధించిన గడువును పొడగించాలని కోరుతూ ఒయూ 2017 బ్యాచ్ స్కాలర్స్ ప్రొ. రెడ్యానాయక్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒయూ పరిశోధక విద్యార్థులు ఎస్. నాగేశ్వర్‌రావు, కోటా శ్రీనివాస్, గ్యార్ నరేష్, పోతగంటి వెంకన్న, చిప్పలపల్లి సోమశేఖర్, అలెగ్జాండర్, జంపాల రాజేష్, చౌటి ప్రభాకర్, వెంకన్న, చిరంజీవి, రవి, సుమంత్, వెంకటేష్, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టింగ్ రీసైక్లింగ్ కార్ఖానాలో ప్రమాదం.. ఒకరి మృతి



మృతుడు రెహ్మాత్ ఆలీ

ధర్నాచౌక్, అక్టోబరు 29 ప్రభాతవార్త: భోలక్‌పూర్‌లోని కళ్యాణి ఖార్ఖానాలో విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు తీవ్ర గాయాల పాలై మృతి చెందిన సంఘటన ముషీరాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం గుల్షన్‌నగర్‌లో రియాజుద్దీన్ ప్లాస్టింగ్ రీసైక్లింగ్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. అందులో సిద్దిఖ్‌నగర్‌కు చెందిన రెహ్మాత్ ఆలీ(35) రోజు మాదిరిగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ప్రమాదవశాత్తు చేయి మిషన్‌లో పడి మనికట్టు వరకు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ రెహ్మాత్ ఆలీని వెంటనే సమీపంలోకి గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆయన అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతనికి భార్య, అయిదేళ్ల బాలుడు ఉన్నారు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ పోలీసులు బాధితులు, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

### బ్రహ్మ సమాజం ప్రస్తుతం
## విస్తృతంగా పాచుర్యంలోకి రావాలి

**తెలంగాణ మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య**




భాగ్యనగరంలో అఖిల భారత బ్రహ్మసమావేశంలో పాల్గొన్న జస్టిస్ జి.చంద్రయ్య

గోషామహల్, అక్టోబర్ 29ప్రభాత వార్త: ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరు విద్య ప్రాముఖ్యత తెలుసుకుని ముందడగు వేయాలని తెలంగాణ మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య పిలుపు నిచ్చారు.దేశ సౌభాగ్యత సమ సమాజ అభివృద్ధి కోసం రాజారామ్ మోహాన్‌రాయ్ స్థాపించిన బ్రహ్మ సమాజం ప్రస్తుతం విస్తృత్తంగా ప్రాచుర్యంలోకి రావాల్సిన అవసరం ఉందని,యువతను ఎక్కువగా భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.శనివారం ఈడెన్‌గార్డెన్స్‌లో ఉన్న కచ్చి భవన్‌లో దక్కన్,ఆంధ్ర బ్రహ్మ సమాజాల సంయుక్త ఆద్వర్యంలో అఖిల భారత బ్రహ్మ సమాజం 131వ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ముఖ్యఅథిథిగా విచ్చేసిన జస్టిస్ జి.చంద్రయ్య లాంఛనంగా జెండా ఎగురవేసి బ్రహ్మస్థాపన సమావేశాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధి,మానసిక,పరిపక్వత కోసం బ్రహ్మ సమాజం అవసరం ఎంతయినా ఉందన్నారు.బ్రహ్మ సమాజ వ్యవస్థాపకులు రాజారామ్‌మోహాన్‌రాయ్ సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.బ్రహ్మసమాజ సిద్దాంతాలు పాటిస్తే సమాజంలో శాంతి చేకూరుతుందన్నారు. కుల,మతాలకు వ్యతిరేకంగా ఉండాలన్నారు.మానవులందరూ ఒక్కటే, భగవంతుడు, ఒక్కడే అనే సమభావజాలాన్ని జనంలోకి తీసుకువెళ్లి సనాతన భారతీయ సంప్రదాయాలు తరతరాలుగా కొనసాగించేందుకు కృషి చేశారన్నారు.అఖిలభారత బ్రహ్మ సమాజం సమావేశాలకు తరువాత బ్రహ్మ సమాజం సమావేశాలకు చారిత్రక భాగ్యనగరం వేదిక కావడం అభినందనీయమన్నారు.వివిధ రాష్ట్రాలోపాటు బంగ్లాదేశ్ నుంచి కూడా 350మంది ప్రతినిధులు పాల్గొన్నట్లుగా తెలిపారు.ఈ సమావేశంలో అఖిలభారత బ్రహ్మ సమాజం కార్యదర్శి సౌరవ్‌డే,హైకోర్టు సీనియర్ అడ్వ కేట్ పద్మావతి, రాహుల్‌శాస్త్రి, దక్కన్‌బ్రహ్మ సమాజం కార్యదర్శి అజయ్‌గౌతం, సమావేశాల కమిటి చైర్మన్ అనిందితగౌతమ్, డాక్టర్ జ్యోత్స్న్య, ఇలియాస్, బ్రహ్మసెంట్రల్ కౌన్సిల్ అధ్యక్షులు పి.కృష్ణ, వేదాచార్య,బి.రవి,శంకర్,ప్రవీణ్,వేమ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలి


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, అక్టోబర్ 29 ప్రభాతవార్త : విద్యార్థులు చదువులో మంచి ప్రతిభ కనబర్చి, ఉన్నత శిఖరాలను అందుకోవాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ విద్యార్థులకు తెలిపారు. సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ పార్టీని జరిపారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన విద్య ప్రభుత్వ కళాశాలలో బోధించడం జరుగుతోందని, ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ముఖ్యంగా సీతాఫల్ మండి డివిజన్‌లోని సీతాఫల్‌మండిలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, జూనియర్, డిగ్రీ కాలేజీలు ఉన్నాయని, విద్యార్థులు విద్యను పూర్తి చేసుకున్న తరువాత ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సెట్విన్ కూడా ఇక్కడే ఉందన్నారు. విద్యార్థులతో పాటు కార్పొరేటర్ సామలహేమ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సెట్విన్‌లో 1200 మంది విద్యార్థులు స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీఈ జాయింట్ డైరెక్టర్ రాజేందర్, యాదగిరి, సెట్విన్ ఎండీ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ చామచంద్రంలు పాల్గొన్నారు.

# రసరమ్యం రాగరంజితం 'శ్రీకృష్ణరాయబారము' పౌరాణిక పద్యనాటకం


శ్రీకృష్ణరాయబారము పౌరాణిక పద్యనాటకం నటులను సత్కరించిన విశ్వేశ్వరరావు, గోపాలకృష్ణమూర్తి

నాంపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త : అలకాపురి శ్రీసాయినాథుని 26వ బ్రహ్మోత్సవ వేడుకలను పురస్కరించుకొని శ్రీ చోడేశ్వర నాట్యకళామండలి వారి సమర్పణ, మల్లాది శ్రీసాయిహరీష్ నిర్వహణలో తిరుపతి వెంకట కవులు రచనలో కృష్ణుడుగా సిహెచ్.శూలపాణి, దుర్యోధనుడుగా బాలనాగేశ్వరరావు, కర్ణుడుగా మల్లాది వెంకటరమణ, విదురుడుగా పి.కోటేశ్వర రావు, దృతరాష్ట్రుడుగా వివిఎల్.నర్సింగరావు, గాంధారిగా పి.సావిత్రి, భీష్ముడుగా శ్రీనివాసరావు, ద్రోణుడుగా ఎం.రాంమోహన్‌రావు, అశ్వద్ధామగా బి.నారాయణస్వామి, వికర్ణుడుగా వెంకటేష్‌లు ప్రధాన పాత్రల్లో అద్భుతంగా నటించిన శ్రీకృష్ణ రాయ బారము పౌరాణిక పద్యనాటకము రసరమ్యం, రాగరంజితంగా ప్రదర్శింపబడి విచ్చేసిన అశేష ప్రేక్షకులను రంజింపజేసింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన డా. విశ్వేశ్వరరావు, గోపాల కృష్ణ మూర్తి, వి.వీరేందర్, డి.మురళి, జయంత్ తదితరులు శ్రీకృష్ణరాయబారము పౌరాణిక పద్య నాటకంలో నటించిన కళాకారులందరినీ ఘనంగా సత్కరించి మాట్లాడుతూ అలనాటి మన అద్భుత కళ నాటకరం గాన్ని, కళాకారులను ఆదరించి ఇతోధికంగా ప్రోత్సహించాలని, ఇలాంటి ఆధ్యాత్మిక కళాసంపదను భావిత రాలకు తెలియజెప్పి, అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : గజ్జల యోగానంద్

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 29, ప్రభాతవార్త : ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి బిజెపి ఇంచార్జ్ గజ్జల యోగానంద్ పిలుపునిచ్చారు. జివై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం ఉదయం 9:30గంటల నుండి మధ్యాహ్నం 12:30గంటల వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పోచమ్మ ఆలయం దగ్గర, ప్రగతినగర్, కూకట్‌పల్లి 2లలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జివై ఫౌండర్, ట్రస్టీ, జనరల్ ఫిజిషియన్ కంటి పరీక్ష సంబంధిత సమస్యలకు ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్ నిపుణులైన అనుభవం గల స్పెషలిస్ట్ డాక్టర్ల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో రక్తంలో షుగరు, బీపీ, గుండెకు సంబంధించిన ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య శిబిరం నందే గుండె వ్యాధులను నిర్ధారించడం జరుగుతుందన్నారు. పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరం నందు పేదలకు ఏదైనా వైద్యం కానీ తక్షణ వైద్య సహాయం అవసరమైన వారికి అందిస్తామని ఆయన తెలిపారు.

# ఘనంగా నాగుల పంచమి వేడుకలు


రామారావునగర్‌లో నాగుల చవితి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న భక్తులు

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 29, ప్రభాతవార్త : రామారావునగర్‌లోని శ్రీవిఘ్నేశ్వర శివ పార్వతుల ప్రసన్నాంజనేయ నవగ్రహ నాగదేవత దేవాల యంలో నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు బారు లు తీరారు. జాతకంలో దోశాలు పోవాలని, పెళ్ళి కావాలని, సంతానం లేని వారు సం తానం కలుగుతుందని, నమ్మకంతో నాగదే వత పుట్ట వద్ద పండ్లు, పాలు, కోడిగుడ్లతో, నైవేద్యాలు సమర్పించారు. మహిళలు, చిన్నారు లు, మగవాళ్ళు నాగపుట్టల వద్ద పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగుల సత్యం, అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పి శివయ్య, కోశాదికారి సాంబశివ, సలహాదారులు ఆవుల సంజీవ, సభ్యులు సుదర్శన్‌రెడ్డి, భిక్షపతి, బాలరాజు, కృష్ణయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ బోర్డు డ్రోన్ సర్వే శ్రీకారం చుట్టేందుకు ఏర్పాట్లు సిద్ధం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బోర్డు అధికారులు

కంటోన్మెంట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో స్వమిత్వ పథకం అమలు చేసేందుకు శ్రీకారం చుడుతున్నామని కంటోన్మెంట్ బోర్డు ఇంజనీర్లు గోపాలక్రిష్ణ దాస్, ఉమా శంకర్‌లు, స్పెషల్ ఆఫీసర్ పరశరామ్‌లు తెలిపారు. శనివారం కంటోన్మెంట్ బోర్డులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో టాక్స్ డిజిటలైజేషన్ సర్వే ఈ నెల 31 నుంచి సర్వే కార్యక్రమాని న్ని చేపడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన డ్రోన్ సర్వే గత జూలై, ఆగస్టులో నిర్వహించడం జరిగిందన్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న 46 వేల ఇండ్లను సర్వే చేసేందుకు శ్రీకారం చుట్టనున్నట్లు వారు తెలిపారు. యజమాని పేరు, ఇంటి నెంబర్, బిల్డింగ్ అనుమతి, బోర్డు అనుమతితో ఎన్ని ఫ్లోర్లు, అనుమతి లేకుండా ఎన్ని ఫ్లోర్లు ఉన్నాయని ఈ సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గరుడ లిజిక్స్ సాఫ్ట్ టెక్ కంపెనీ సహకారంతో ఈ సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇంటి యజమానులు ప్రతి ఏటా ఆస్తి పన్ను చెల్లిస్తున్నారా లేదా అటు వంటి వివరాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నెల రోజుల్లో స్వమిత్వ కార్డుల ప్రక్రియ వేగవంతం చేసేందుకు ఆయా ప్రాంతాల్లోని కాలనీ ప్రతినిధులు, ఇంటి యజమానులు బోర్డు సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు టాక్స్ సూపరిండెంట్ అక్తర్ అలీ, టాక్స్ అధికారులు వెంకటరమణ, అనీ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్‌అదాలత్ విజయవంతంపై సమావేశం

## సెషన్స్‌జడ్జి పాపిరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న సెషన్స్‌జడ్జి పాపిరెడ్డి, కుశ, దుర్గాప్రసాద్, రాధిక జైశ్వాల్ తదితరులు

నాంపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త : మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి నవంబరు 12న జరుగబోయే జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయాలని సూచిస్తూ మనోరంజన్ కోర్టు కాంప్లెక్స్ జ్యుడిషియల్ ఆఫీసర్లు, న్యాయవాదులు, రిప్రెజెంటేటివ్స్ ఆఫ్ బ్యాంక్ అఫీషియల్స్, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూట్స్ వారితో సమావేశం నిర్వహించి ప్రతీఒక్కరూ తమవంతు కృషిచేయాలని కోరారు. బ్యాంక్ అఫీషియల్స్‌కి, సంబంధిత పార్టీలకు నోటీసులు జారీచేసి అధికసంఖ్యలో ఎన్.ఐ యాక్ట్స్/ చెక్‌బౌన్స్ కేసులను ఈ లోక్‌అదాలత్‌లో పూర్తయ్యేలా చూడాలన్నారు. అంతేకాకుండా అధికసంఖ్యలో కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మాట్రిమోనియల్ (కుటుంబ తగాదాలు) కేసులను రాజీకుదిర్చేలా చూడాలని సూచించారు. అలాగే వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకొని వాటికి పరిష్కారాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కుశ, చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దుర్గాప్రసాద్, మెట్రోపాలిటన్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి రాధిక జైశ్వాల్‌లు అక్కడ వచ్చిన వారికున్న సమస్యలకు పరిష్కారాలు తెలియజేశారు. సత్వర న్యాయానికి, కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ చాలా ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మనోరంజన్ కోర్టు కాంప్లెక్స్ జ్యుడిషియల్ ఆఫీసర్లు, బ్యాంక్ అఫీషియల్స్, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ వారు పాల్గొన్నారు.

# గంటలో వస్తానని వెళ్లిన యువకుడు అదృశ్యం

సికింద్రాబాద్, అక్టోబర్ 29 ప్రభాతవార్త : అరగంటలో వస్తానని వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వారాసిగూడ బ్రాహ్మణబస్తీకి చెందిన బండిరెడ్డి శ్రీధర్ కుమారుడు ప్రభుతేజ్ (26) శుక్రవారం సాయంత్రం సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి అరగంటలో వస్తానని అమ్మతో చెప్పి బయటికి వెళ్లాడు. ఎంతకు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులను, స్నేహితుల, తెలిసినవారివద్ద ఆరాతీశారు. ఎంతకూ ప్రయోజనం లేకపోవడంతో శనివారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


కళ్యాణలక్ష్మీ చెక్కును అందజేస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి

నిజాంపేట్, అక్టోబర్29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన 11మంది లబ్ధిదారులకు శనివారం మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, అందులో భాగంగానే కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలతో పేదల పెన్నిదిగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కమిషనర్ వంశీకృష్ణ, కార్పొరేటర్లు కాసాని సుధాకర్ ముదిరాజ్, గాజుల సుజాత, కో-ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్, ఏనుగుల అభిషేక్‌రెడ్డి, చంద్రగిరి జ్యోతి, టీఆర్ఎస్ నాయకులు ఎన్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ప్రారంభోత్సవ కార్యక్రమంలో పూజ చేస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్

నిజాంపేట్, అక్టోబర్29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7వడివిజన్ పరిధి రెడ్డి ఎవె న్యూ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శని వారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో కమిషనర్ వంశీకృష్ణ, ఎలక్ట్రికల్ ఏఈ రాకేష్, మున్సిపల్ ఏఈ ప్రసన్న, డీఈ దాసయ్య, కార్పొరేటర్ ప్రణయధన్‌రాజ్, ఏనుగుల అభిషేక్‌రెడ్డి, సంతోష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# వచ్చే సంవత్సరం నుంచి సదర్ ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వ హిస్తుంది


సదర్ మేళాలో పాల్గొన్న జిజిఎఫ్‌వై చైర్మన్,టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్,నాంపల్లి టిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: వచ్చే సంవత్సరం నుంచి నగరంలో సదర్ ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని మంత్రి తలసానిశ్రీనివాస్‌యాదవ్ ప్రకటించడం సంతోషదాయకమైన విషయమని గడ్డంగంగాధర్ ఫౌండేషన్ చైర్మన్,టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్,నాంపల్లి నియోజకవర్గంటిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్‌లు అన్నారు.నగరంలో జరిగిన సదర్ సమ్మేళనంలో పాల్గొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యావత్ యాదవ సమాజం గర్వించదగిన విషయమన్నారు.యాదవ కులస్థులకు ఎంతో శుభపరిణామన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# వీనులవిందుగా 'ప్రతీరాత్రి వసంతరాత్రి' సినీసంగీత విభావరి

రవీంద్రభారతి, అక్టోబరు 29 ప్రభాతవార్త : అమరగాయకులు ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం గాత్రం, పాడిన పాటలు అజరామరమని, ప్రతీ ఇంటా వారి పాటలు మారుమ్రోగుతూనే ఉంటాయని, తరతరాలు గుర్తుంచుకొని తమ హృదయాల్లో పదిలపరచుకొంటారని తెలంగాణ శాసనసభ తొలి సభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, నివేదిక ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత గాయకుడు ఘంటసాల శతజయంతిని పురస్కరించుకొని ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంలు పాడిన ఆణిముత్యాల్లాంటి పాటలను వర్ధమాన గాయకులు పి.సుభాష్, ఆమని, కళ్యాణి, బాలకామేశ్వరరావు, శ్రీనివాస్, అఖిల, రాజన్ తదితరులు ప్రముఖ ప్రతీరాత్రి వసంతరాత్రి శీర్షికన సినీసంగీత విభావరిలో ఆలపించి ఆహుతులకు వీనులవిందు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్.మధుసూదనాచారి, విశిష్ట అతిథులు డొక్కా మాణిక్యవరప్రసాద్, కలిసి అద్భుతంగా పాటలు పాడి వినిపించిన గాయకులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

# గాయకుడు సి.సుదర్శన్‌కు అభినందన సత్కారం

చిక్కడపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త: శ్రీసాయి లలిత మ్యూజిక్ అకాడమి అధినేత్రి, ప్రముఖ గాయనీ లలితా రావు, డాక్టర్ టి.వి.రావు ఆధ్వర్యంలో 'ప్రముఖ గాయకుడు సి.సుదర్శన్‌కు అభినందన సత్కార కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా 'స్వరకిన్నెర' శారదావరపుత్ర చింతలపూడి త్రినాథరావు, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి హాజరై సుదర్శన్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు

# హై స్కూల్లో విద్యార్థుల లీడ్ కాన్ఫరెన్స్


లీడ్ కాన్ఫరెన్స్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

జీడిమెట్ల, అక్టోబర్ 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అపురూపకాలనీ టీవీఆర్ మోడల్ హై స్కూల్లో శనివారం స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్ ఘనంగా నిర్వహించారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌కేజి నుంచి రెండవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన లీడ్ కాన్ఫరెన్స్ సిస్టం బోధనా విధానంతో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కోటిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి వారికి చక్కటి బోధనా విధానాన్ని అందిస్తున్నారని కొనియాడారు.

# మెట్టుగూడ దూద్ బావి ఘటన బాధితులకు అండగా బిజెపి : మేకల సారంగపాణి


మెట్టుగూడ దూద్ బావి ఘటన బాధితులను పరామర్శిస్తున్న మేకల సారంగపాణి

మెట్టుగూడ, అక్టోబర్ 29 ప్రభాతవార్త: మెట్టుగూడ దూద్ బావి వద్ద ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన బాదితులకు అండగా బీజేపీ ఉంటుందని సికింద్రాబాద్ మంహాకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి హామి నిచ్చారు. ఈ మేరకు ఆయన ఘటన బాధిత కుటుంబాలను బిజేపీ నాయకులతో కలసి పరమార్శించారు. వారితో మాట్లాడి కేంద్రప్రభుత్వం ద్వార ఆదుకుంటామని బాదితులకు బరోసానిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సమస్యను ఇప్పటికే తీసుకెళ్లడం జరిగిందని ఆయన ఈ ప్రాంతానికి వచ్చి బాదితులకు అండగా ఉంటారని వారికి చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ఎం ప్రభుగుప్తా, శ్రీధర్, హనుమాన్లు, శ్రీనాథ్, మంజుల, నీలం శ్రీనివాస్ ముదిరాజ్, సరిత, నరసింహ, కుమార్, కృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

# లక్ష్మీనారాయణ దేవాలయంలో అన్నకోటి


లక్ష్మీనారాయణ దేవాలయంలో జరిగిన అన్న కోటి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎన్‌డిఎంఏ ఉపాధ్యక్షులు మర్రి

బేగంపేట అక్టోబరు 29,ప్రభాతవార్త : రాంగోపాల్‌పేట డివిజన్ లక్ష్మీ నారాయణ దేవాలయంలో శనివారం నిర్వహించిన అన్న కోటి కార్యక్రమం లో మాజీ ఎన్‌డిఎమ్ ఏ ఉపాధ్యక్షులు మర్రి శశిధరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్స్ ఇంజనీర్ దుర్గా ప్రసాద్, రాంగోపాల్‌పేట డివిజన్ అధ్యక్షులు దయానందరావు, దేవాలయ ఛైర్మన్ గుమ్మెడెల్లి శ్రీనివాస్, రవి, వివేష్, చంద్రపాల్‌రెడ్డి, వేదప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# జానపద నృత్య ప్రదర్శనలో మేడ్చల్ మల్కాజగిరి జిల్లాకు ప్రథమ బహుమతి



సర్టిఫికెట్స్‌తో విద్యార్థులు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 29, ప్రభాతవార్త : స్క్రిట్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి జానపద నృత్య ప్రదర్శనలో అన్ని జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా మేడ్చల్ మల్కాజగిరి జిల్లాల విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులు రాష్ట్ర ఎస్సీ ఈ ఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శనివారం సర్టిఫికెట్స్, క్యాష్ ప్రైజ్‌ను అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లమ్మబండ విద్యార్థులను ఉపాధ్యాయుల బృందాన్ని మేడ్చల్ మల్కాజగిరి జిల్లా విద్యాధికారి విజయలక్ష్మీ అభినందించారు.

# అడిక్‌మెట్ డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యేముఠాగోపాల్


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, అక్టోబరు 29 ప్రభాతవార్త: అడిక్‌మెట్ డివిజన్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌బస్తీలో సాధారణ బడ్జెట్ నుంచి మంజూరైన రూ.15లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డీఈ సన్నీ, ఏఈ విశేష్, టిఆర్ఎస్ యువనేత ముఠాజయసింహ, టిఆర్ఎస్ నేతలు కొండపల్లి మాధవ్, శ్యామ్‌సుందర్, అస్లామ్,ప్రసన్న, గురుదీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర నిర్వహించారు.

# కూరగాయలలో అన్ని రకాల పోషకాలుంటాయి

## ఎస్ఎంపి ఉన్నత పాఠశాల చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి


ఎస్ఎంపి పాఠశాలలో కూరగాయల మార్కెట్‌ను నిర్వహిస్తున్న విద్యార్థులు

నార్సింగి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : తాజా కూరగాయలలో పిల్లల ఎదుగుదలకు అవసరమయ్యే అన్ని రకాల పోషకాలు ఉంటాయని ఎస్ఎంపి ఉన్నత పాఠశాల చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో ఉన్న ఎస్ఎంపి పాఠశాల లో విద్యార్థులకు కూరగాయల వలన కలిగే లాభాలు తెలిపేందుకు "కూరగాయల మార్కెట్"ను ఏర్పాటు చేయించారు. విద్యార్థులంతా తమ వద్ద ఉన్న కూరగాయల పేర్లు, వాటి వలన కలిగే ప్రయోజ నాలను వివరించారు. ఏ కూరగాయలో ఏ విటామిన్లు? ఏ ఎంజైమ్ లు? ఎంతెంత ఐరన్, క్యాల్షియం, పొటాషియం వంటి మూలకాలు ఉంటాయో? కూడా చెప్పి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సంభ్రమా శ్చర్యాలకు గురి చేశారు. అచ్చం కూరగాయల మండీని తలపించేలా చిన్నారుల కూరగాయలు అమ్మారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా 100.శాతం మేలు చేసేవి కూరగాయలు మాత్రమేనని తెలిపారు. పిజ్జాలు, బర్గర్లు, బ్రెడ్‌లు ఇలా బేకరీలలో లభించే ఐటమ్స్‌లలో చాలా వరకు సైడ్ ఎఫెక్ట్స్‌ను కలిగించే విష పదార్థాలుం టాయన్నారు. తల్లులు తమ బిడ్డలకు ఆరోగ్యంను ఇవ్వాలంటే ఇళ్లల్లో చేసిన పదార్థాలనే పెట్టాలని, బయటి పదార్థాలకు దూరంగా ఉంచాలని సూచించారు. ఎదిగే వయసున్న పిల్లలకు వారానికి రెండు మార్లు నవ్వుల లడ్డూలు, పల్లి పట్టీలు తప్పకుండా ఇవ్వాలన్నారు. కూరగాల మార్కెట్ లో వ్యాపారులు చేసే తూకాల మోసాలపై కూడా ఉపాధ్యాయులు చిన్నారులకు అవగాహన కల్పించారని తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు సామాజిక అంశాలలో కూడా చిన్నారులకు అవగాహన పెంచేందుకు తరుచూ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామ న్నారు. ఫస్ట్‌క్లాస్ మార్కులు సాధించడం ఎంత ముఖ్యమో కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా పెంచుకోవడం అంతే ముఖ్యమని, అందుకే విద్యార్థులను ఆట,పాట,వైజ్ఞానిక ప్రదర్శనలు, నృత్యాలు, నాటికలలో అవకాశాలు కల్పించి, ప్రోత్సహిసున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రకళ, ప్రిన్సిపాల్ జేసుదాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిలకలగూడలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

## సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, అక్టోబర్ 29 ప్రభాతవార్త : ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడతాయని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ తెలిపారు. చిలకలగూడలోని పీఎం జన ఔషధి, ఓపెన్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఎప్టెర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెడికర్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో ఆమే పాల్గొని క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని ప్రభుత్వ ఆస్పత్రులను ఏర్పాటు చేసినా సీజనల్‌గా ఉచిత మెడికర్ క్యాంపులు నిర్వహించడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఇలాంటి వైద్యశిబిరాల వల్ల అనేకసార్లు ప్రజలకు పెద్దపెద్ద రోగాలు బయటపడి, ప్రాణాలు కాపాడుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. రోగంవస్తే తప్ప ఆస్పత్రులకు వెళ్ళని కొందరు ఇలాంటి శిబిరాల్లో పరీక్షలు జరిపించుకుంటారన్నారు. అప్పుడే ఆరోగ్య సమస్యలు బయటపడతాయని పేర్కొన్నారు. ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు ఉచితవైద్య శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికి వీధివీధినా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యాక్రమంలో గోపు రమణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, రమణచారి, ధర్మేంద్ర, హరిష్‌లు పాల్గొన్నారు.

# టీపిటి బకాయిలు తక్షణమే చెల్లించాలి

## కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ

కంటోన్మెంట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా జాప్యం చేయడంతో హై కోర్టును ఆశ్రయించినట్లు కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. శనివారం బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం టీపిటి, సర్వీస్ ఛార్జీల కింద 100 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బోర్డుకు చెల్లించడంలో జాప్యం చేస్తున్నందు వల్ల హై కోర్టులో ఫిటిషన్ దాఖలు చేసినట్లు ఆయన తెలిపారు. టీపిటి బకాయిల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ హాజరు కావాల్సి ఉందన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పైరవీలు చేసేందుకు బోర్డుకు వస్తున్నారని ఆరోపించారు. తమ హయాంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో మాజీ బోర్డు సభ్యులు జోక్యం చేసుకోవడం సరైంది కాదన్నారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనల వద్ద ఏ అర్హత కలిగి ఉన్నారో తేల్చి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ బోర్డు సభ్యులు అవగాహన రహితంగా పరమానంద శిష్యులవలే వ్యవహరిస్తు న్నారని ఆరోపించారు. ఆర్మీ ఏరియాలో రోడ్ల మూసి వేతపై పగటి వేశాలు వేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్, కన్వీనర్ విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలలో పర్యటించిన కార్పొరేటర్

నిజాంపేట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ పరిధిలోని సాయి అనురాగ్ కాలనీ, శ్రీరేణుక ఎల్లమ్మ కాలనీలలో శనివారం కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ కాలనీలో మంజూరైన నూతన రోడ్లు, డ్రైనేజీ పనులపై కాలనీవాసులతో చర్చించి త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు.అనంతరం శ్రీరేణుక ఎల్లమ్మ కాలనీ రోడ్డు నెంబర్15లో నూతనంగా మంజూరైన రోడ్లు, డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పరిశీలించి త్వరలోనే అభివృద్ధి పనులను పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# క్యాథలిక్ సిమెట్రీని పరిశీలించిన అధికారులు



సికింద్రాబాద్, అక్టోబర్ 29 ప్రభాతవార్త : బన్సీ లాల్ పేట్ డివిజన్ బోయిగూడలోని క్యాథలిక్ సిమెట్రీ (గ్రేవ్ యార్డ్)ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు శనివారం అధికారులు సందర్శించారు. క్యాథలిక్ సిమెట్రీ ప్రహరిగోడ కూలిపోయిందని, చెత్తచెదారం కూడా పేరుకుపోయిందని నిర్వాహకులు జయరాజ్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి విన్నవించారు. ఇందుకు స్పందించిన మంత్రి క్యాథలిక్ సిమెట్రీ సందర్శించి సమస్యలను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. దీంతో ఈఈ సుందర్శన్, డీఈ ఆంజనేయులు జయరాజ్‌తో పాటు ఈ ప్రాంతాన్ని సందర్శించి కూలిపోయిన ప్రహారిగోడను, చెత్తకుప్పలను పరిశీలించారు. రెండు రోజులలో ప్రహారిగోడ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని, ఆదివారం ఉదయం వరకు చెత్తచెదారాన్ని తొలగింపు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# వైభవంగా శ్రీ కరిగిరి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



పవిత్రోత్సవంలో భాగంగా పూజలు నిర్వహిస్తున్న దృశ్యం ఇన్‌సెట్‌లో స్వామి వారి అలంకరణ దృశ్యం

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ స్వరూప్‌నగర్‌లోని శ్రీ కరిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సేవా కాలం, బాలబోగము, మంగళశాసనము, మంగళశాసనము, ద్వార తోరణ,ద్వజకుంబరాధన, చతుస్థానార్చన, అనంతరం మూల మంత్రం, మూర్తి మంత్ర హోమాలు, మంగళ శాసనము, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణము, చతుస్థానార్చాన, మూతమంత్ర, మూర్తి మంత్రహోమాలు, నిత్య పూర్ణాహుతి, నివేదన, మంగళశాసనము, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కందాడై శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు శ్రీమాన్ వెంకటేశ్వరచార్యులు, శ్రీనివాసాచార్యులు, యజ్ఞనికులు రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 27 నుంచి జరుగుతున్న పవిత్రోత్సవాలు ఈనెల 30వ తేది వరకు జరుగుతాయని నిర్వహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నామని, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారని తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, భక్తులకు వివిధ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

# ఆటో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులు అరెస్టు..

## రూ. 30లక్షలు విలువచేసే 21ఆటోల స్వాధీనం : డీసిపి రక్షితమూర్తి



వివరాలను వెల్లడిస్తున్న మల్కాజిగిరి డీసిపి రక్షిత కె మూర్తి..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** రాచకొండ, సైబరాబాద్‌లోని వివిధ పోలిస్టేషన్ల పరిధిలో పార్కింగ్ చేసిన ప్యాసింజర్ ఆటోలను చోరీ చేసి తిరిగి వాటిని కర్ణాటక ప్రాంతాల్లో విక్రయిస్తున్న నలుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డీసిపి రక్షిత మూర్తి వివరాలను వెల్లడించారు. కర్ణాటక ప్రాంతం గుల్బర్గా ప్రాంతానికి చెందిన మగనూర్ శ్రీనివాస్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ మౌలాలిలో నివాసముంటున్నాడు. గత కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో గుల్బర్గా ప్రాంతానికి చెందిన మనావర్ బేగ్, అన్వర్ బేగ్, జావిత్‌తో పరిచయం ఏర్పడింది. వారితో కలసి ఆటోలోను చోరీ చేసి విక్రయించడం ప్రారంభించారు. ఆటో చేసిన ఆటోలను దొంగిలించి వాటి పరికరాలను మార్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితుల సెల్‌ఫోన్, సీసీ ఫుటేజి ఆధారంగా మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి శనివారం ఆ నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఆమె తెలిపారు. వారి వద్ద నుండి 21 ఆటోలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. చాకచక్యంగా వ్యవహరించి వారిని అదుపులోకి తీసుకున్న మల్కాజిగిరి పోలీసులను డీసిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఏసిపి నరేష్ రెడ్డి, సీఐ జగదీశ్వర్ రావు, క్రిష్ణ మనూర, కె యాదగిరి, లక్ష్మయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ హెచ్‌ఎండిఏ లేఅవుట్‌లో సదుపాయాలు కరువు..?

## అధ్వాన్నంగా తయారైన రోడ్లు : నీటి సౌకర్యం లేక చర్మవ్యాధులు

## ఖాళీ చేసి వెళ్లిపోతున్న ప్రజలు : భారీగా పడిపోయిన ప్లాట్ల ధరలు



హెచ్‌ఎండిఏ నిర్మించిన లేఅవుట్ ప్రధాన ద్వారం దృశ్యం



అంతర్గత రోడ్లపై ఏరులై పారుతున్న మురుగునీరు దృశ్యం

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉప్పల్, రామంతాపూర్ భగాయత్‌లో చేపట్టిన మాడల్ లేఅవుట్ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది. ఉప్పల్ భగాయత్ రైతుల నుంచి భూములు తీసుకుని ప్లాట్లు అప్పగించిన హెచ్‌ఎండిఏ అధికారులు అందులో మౌళిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. వివరాలు ఇలాఉన్నాయి. ఉప్పల్ భగాయత్ పరిధిలోని సుమారు 733 ఎకరాలు, రామంతాపూర్ భగాయత్ పరిధిలోని 95 ఎకరాలు హెచ్‌ఎండిఏ మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భూములు కోల్పోయిన ప్రతి ఎకరా భూమి ఉన్న రైతుకు వెయ్యిగజాలు ఇచ్చేవిధంగా హెచ్‌ఎండిఏ అంగీకారం తెలిపింది. సేకరించిన భూమిలో 104 ఎకరాలు వాటర్‌వర్క్స విభాగానికి, 150 ఎకరాలు సివరేజీ బోర్డు తీసుకుంది. మరో 150ఎకరాలు మెట్రో రైలు స్టేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం తీసుకుంది. అయితే ఇంకా 413 ఎకరాలు భూమి ఉండగా దీనిని మాడల్ లేఅవుట్‌గా తయారు చేశారు. లేఅవుట్‌లో 40 శాతం స్థలాన్ని ప్లాట్లుగా అభివృద్ధి చేసి మిగతా 60 శాతం స్థలాన్ని వివిధ వసతుల కోసం కేటాయించారు. మూసీ వరద నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని మూసీ పక్కన 200 అడుగుల స్థలాన్ని బఫర్ జోన్‌గా ప్రకటించి, దాని పక్కనే మరో 100 అడుగుల స్థలంలో రోడ్లు ఉండే విధంగా ప్లాన్ రూపొందించారు. అధికారులు రూపొందించిన లేఅవుట్‌లో వెయ్యి గజాలు ఉన్న ప్లాట్‌లకు 80 అడుగుల రోడ్ల నుంచి తక్కువ గజాలు ఉన్న ప్లాటుకు 40 అడుగుల రోడ్లు ఉండే విధంగా రూపొందించారు. ఒక్కో ప్లాటు వెయ్యి, 500, 300, 200, 150 గజాలతో తయారు చేశారు. వసతుల కోసం పార్కులకు అధిక స్థలాన్ని కేటాయించగా, పోలీస్‌స్టేషన్ కోసం 6684 గజాలు, పోస్ట్ ఆఫీసుకు 2266, స్కూల్స్ కోసం 4632 గజాలు, షాపింగ్ సెంటర్ కోసం 7456 గజాలు, ఇతర అవసరాల కోసం మరికొంత స్థలాలు కేటాయించారు.

**హెచ్‌ఎండిఏ లేఅవుట్‌లో సదుపాయాలు కరువు :**

ఉప్పల్‌లో రైతుల నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వం నిర్వాసితులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించింది. ప్లాట్లు తీసుకున్న వారిలో కొందరు విక్రయాలు చేసుకోగా, మిగిలిన ప్లాట్ల నిర్వహకులు తమ పిల్లలకోసం తమ వద్దే ఉంచుకున్నారు. హెచ్‌ఎండిఏ అధికారులు రెండు సార్లు ప్లాట్లు వేలం వేసి సుమారు రూ.2వేల కోట్ల వరకు ఆదాయం పొందింది. అయితే ప్లాట్లు సరిగ్గా అభివృద్ధి చేయకపోవడంతో చాలా మంది నిర్మాణాలు చేసుకునేందుకు ముందుకురావడం లేదు. ఉదయం, సాయంత్రం వేళలలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయని, రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయం కల్పించడంలేదని అసోసియేషన్ కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు.

**హెచ్‌ఎండిఏ నివాసితులకు చర్మవ్యాధులు :**

ఉప్పల్ హెచ్‌ఎండిఏ లేఅవుట్ మూసీ సమీపంలో ఉండడంతో అందులో ఇళ్లునిర్మించుకుని ఉంటున్న వారు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం మూసీ దుర్వాసన రాకుండా తగు చర్యలు తీసుకుంటామని మొదట ప్రకటించినా ఆచరణలో అమలుకు నోచుకోలేదు. భగాయత్‌లో ఇప్పటి వరకు మంచి నీటి సదుపాయం, డ్రైనేజీవ్యవస్థ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో బోరునీటిపైనే ఆధారపడిన అనేక మంది చర్మవ్యాధుల బారిన పడుతున్నారు. మురుగునీటి కారణంగా జుట్టు ఊడిపోవడంవంటి సమస్యలు వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. గతంలో రూ.60 నుంచి 70వేలకు గజం పలికిన ప్లాట్లు ఇప్పుడు భారీగా పడిపోయినట్లు నిర్వాసితులు పేర్కొంటున్నారు. లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లలో ఉండలేక చాలా మంది ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారని, రాత్రి వేళ వీధి దీపాలు ఉండడం లేదని, అసాంఘిక శక్తుల ఆగడాలు పెరిగిపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే తమ వద్ద ప్లాట్లు ఉంచుకున్న పలువురు యజమానులు వీటిని విక్రయించుకోలేక, ఉండలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి లేఅవుట్ అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మలక్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం : బలాల



ఓల్డ్ మలక్‌పేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల, షఫీ తదితరులు

**మలక్‌పేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని మహబూబ్ మాన్షన్ మార్కెట్ సంజయ్‌గాంధీనగర్‌లో నూతన సివరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను డివిజన్ ఎంఐఎం నాయకుడు సైపుద్దీన్ షఫీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ హస్మత్ అలీ, వార్డు కమిటీ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్‌లో మంచినీరు, డ్రేనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి : కార్పోరేటర్ పన్నాల



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పోరేటర్ పన్నాల

**నాచారం, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మల్లాపూర్ డివిజన్‌లో మంచినీరు, డ్రేనేజీ సమస్య పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వార్డు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. అవసరమైన ప్రాంతాల్లో మంచినీరు డ్రైనేజీ పరిష్కారానికి ప్రతిపాధనలు సిద్దంచేయాలని ఆదేశించారు. లీకేజీలను అరికట్టాలని, కలుషిత జలాల సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం సతీష్‌కుమార్, మనేజర్ సందీప్‌కుమార్ తధితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని డివిజన్లను పూర్తి స్థాయిలో చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు పేర్కొన్నారు. 139 డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో రూ. 25లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యత ఉండకూడదన్నారు. నాణ్యమైన వస్తువులను వినియోగించి పనులు చేపట్టాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. ప్రజలు తనపై పెట్టకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా వారి కోసం నిరతంరం పాటు పడతానన్నారు. అంతేకాకుండా నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, డీఇ లౌక్య, ఏఇ శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి, నాయకులు జీఎన్‌వి సతీష్ కుమార్, నవీన్, ఎస్సార్ ప్రసాద్, ఉపేందర్, రాజు, మోహన్, సంతోష్, రాందాస్, బ్రహ్మయ్య, మురళీధర్, వెంకు, శ్రీధర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మంచినీటి సమస్యను పరిష్కరించాలి : కార్పొరేటర్ అరుణసురేందర్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ చింతల అరుణ

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** డివిజన్లో లోప్రెజర్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం జలమండలి అధికారులను కలిసి సమోసాలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాక్‌టౌన్‌కాలనీ వార్డ్ ఆఫీస్‌లో వాటర్‌వర్క్స జనరల్ మేనేజర్‌తో సమావేశమై పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పలు కాలనీలలో లోప్రెషర్‌తో మంచినీరు రావడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జిఎం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే సమస్య పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కొత్త పైప్‌లైన్లు, కొత్త డ్రైనేజీ లైన్‌లు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్వాయి సంజీవ్‌రెడ్డి, డప్పు రాజు, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

# నాచారంలో బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన బ్రాంచ్ ప్రారంభం



నాచారం నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జీఎం జోనల్ హెడ్ మన్మోహన్ గుప్త,మేనేజర్ చన్నావీర్

**నాచారం, అక్టోబర్ 29 ప్రభాతవార్త:** నాచారం ప్రధాన రోడ్డు స్నేహపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసి బ్యాంక్ ఆఫ్ బరోడా నాచారం బ్రాంచ్‌ను బ్యాంక్ జనరల్ మేనేజర్ జోనల్ హెడ్ మన్మోహన్‌గుప్త ముఖ్యఅతిధిగా పాల్గొని లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంక్ అభివృద్దికి తోడ్పడుతూ ఆర్థికంగా ఎదగాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంక్ నిరంతరం ఖాతాదారులకు వివిధ రకాల డిజిటల్‌సేవందిస్తూ మరింత ముందుకు వెళ్లుతందన్నారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ సి.వి. ఎస్. చంద్రశేఖర్, అధికారులు వినోద్‌కుమార్ బాబు, సుధాకర్, బ్రాంచ్ మేనేజర్ చన్నావీర్, బ్రాంచ్ సిబ్బందితో పాటు ఖాతాదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ అభివృద్దికి తోడ్పడిన కస్టమర్లకు మన్మోహన్ గుప్తా దన్యవాదాలు తెలిపారు. అనంతరం ఖాతాదారులకు డిజిటల్ ప్రాడక్ట్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా వివిద రంగాల్లో సేవ చేస్తున్న కస్టమర్లను అధికారులు ఘనంగా సన్మానించారు.

# బస్వాపురం జలాశయ నిర్వాసితులకు న్యాయం చేయాలి: గోపీనాయక్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** బస్వాపురం జలాశయం నిర్మాణ పనులను లప్పానాయక్‌తండాకు చెందిన భూనిర్వాసితులకు న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దిరావత్ గోపీనాయక్ డిమాండ్ చేశారు. జలాశయ నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి 721 ఎకరాల స్థలాన్ని సేకరించగా 27ఎకరాలకు నష్ట పరిహారం ఇంకా ఎందుకు చెల్లించలేదని ఆయన ప్రశ్నించారు. గ్రామంలో 250 ఇల్లు నిర్వాసితులు కోల్పోతుండగా ప్రత్యామ్నాయంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద దత్తర్పల్లిలోని సర్వేనెంబర్ 294లో 31.16 గుంటల భూమిని గృహాల నిర్మాణం కోసం కేటాయిస్తామని ఎందుకు ఎందుకు నెరవేర్చలేదని అన్నారు. తమ పూర్వీకులు గతంలో నాగార్జునసాగర్ ముంపు ప్రాంతం నుంచి ఇక్కడికి వలస వచ్చి జీవనం సాగిస్తున్నారని, దశాబ్దాల తర్వాత ఈ ప్రాంతం ముంపునకు గురవుతుందని ప్రభుత్వం ప్రకటించడంతో తాము ఎక్కడికి వెళ్లి జీవనం సాగించాలో అర్థం కాని పరిస్థితిలో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యను పట్టించుకోకపోవడం వల్లే గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో తరంగిణి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ గురువర్యులు పద్మజ విశ్వాస్ శిష్య బృందం ఆధ్వర్యంలో కర్ణాటక కచేరి, కోబోర్డ్, గిటార్, వియోలిన్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. అన్నమయ్య సంకీర్తనలు, త్యాగరాజ కృతులు, దేశభక్తి గీతాలు అలపించారు. సుమారు 140 మంది కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువులు భూమలింగం, రమేష్, నాగశ్రీ, శిష్యులను తీర్చిదిద్దారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో గణేశా పంచరత్న, జతిస్వరం, ముద్దుగారేయ్, యశోధ, తిల్లాన శబ్దం, తారంగం, తదితర అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా వేదాంతం సత్యం, మల్లిక్, శ్రీనివాస్‌గుప్త విచ్చేసి కళాకారులను సత్కరించారు. శనివారం వారంతపు సెలవుదినం కావడం సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చిందని నిర్వహకులు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందించిన మైనంపల్లి రోహిత్..



విద్యార్థులకు నోటు పుస్తకాలను అందిస్తున్న మైనంపల్లి రోహిత్

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం ఎంఎస్ఎస్ఓ చైర్మన్ డాక్టర్ రోహిత్ బాబు ఉచితంగా నోటు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. సుమారు 300మంది చిన్నారులకు నోటు పుస్తకాలను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, నాయకులు ఉపేందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాపురెడ్డి, టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చట్ పూజ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు : ఎంపిఆర్



కాంగ్రెస్ పార్టీ నేత పరమేశ్వర్‌రెడ్డి కి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీహార్ అసోసియేషన్ నేతలు

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలో బీహార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే చట్ పూజ ఉత్సవాలకు ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎం పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం బీహార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిఆర్ కు ఆహ్వానం పత్రిక అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బీహార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించడం అభినందనీయమన్నారు పూజా ఉత్సవాలకు నీటి కొలనులు సిద్ధంగా చేసినట్లు తెలిపారు. ఆనందొత్సవాలతో ఉత్సవాలు చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో బీహార్ అసోసియేషన్ నాయకులు రవి శేఖర్ సింగ్. దిలీప్ కుమార్, సుప్రీత్ సింగ్, ప్రభాస్ కుమార్,ఉత్తమ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దు రాళ్లను తొలగిస్తే చర్యలు

**అబ్దుల్లాపూర్‌మెట్,అక్టోబరు 29 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ రెవిన్యూపరిధిలోని సర్వేనంబర్ 399లోని ప్రభుత్వ భూమికి గురువారం రెవిన్యూ అధికారులు హద్దురాళ్లను నాటించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారి ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమికి హద్దురాళ్లను ఏర్పాటు చేసినట్లు ఆర్ఐ భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లా డుతూ ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను ఎవరైనా తొలగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అబ్దుల్లా పూర్‌మెట్ మండల సర్వేయర్ సాయి, కృష్ణారెడ్డి, సిబ్బంది బాలరాజు, రాజేందర్, విఆర్ఏ నవీన్ పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ నేత బాల్‌రెడ్డికి బండారి లక్ష్మారెడ్డి పరామర్శ



బాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** హయత్‌నగర్‌లో జరిగిన కత్తిపోట్లలో గాయపడిన చిలుకానగర్ డివిజన్ టిఆర్ఎస్ నేత ఆకిటిబాల్‌రెడ్డిని శనివారం ఉప్పల్ నియోజకవర్గం టిఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆకిటి బాల్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాల్‌రెడ్డిపై దాడి చేసిన నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్‌రెడ్డి త్వరగా కొలుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఉప్పల్ డివిజన్ నాయకులు ఆకుల మహేందర్, అన్య బాలకృష్ణ, బాషపల్లి నిరంజన్‌చారి, పోసాని పవన్‌కుమార్, పల్లెర్ల సతీష్‌చారి, సల్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి సిఎం కృషి : హోంమంత్రి మహమూద్ అలీ



చైర్మన్ అనితానాయక్, డైరెక్టర్లకు గుర్తింపు కార్డులను అందజేసిన హోంమంత్రి మహమూద్ అలీ

**మలక్‌పేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** రైతుల సంక్షేమం సిఎం కెసిఆర్ ఎంతో కృషి చేస్తున్నారని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. అజంపుర టిఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ అనితానాయక్, డైరెక్టర్లు విద్యానంద్, అభిషేకం, యాదగిరి, సల్మాన్‌ఖాన్, రాముయాదవ్, నరేష్, ఎజాస్, లలితకు ఆయన గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్ సారధ్యంలో రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. చైర్మన్ అనితానాయక్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరను అందించి వారి అభ్యున్నతికి పాటు పడతామన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా సులువుగా సమస్యలు పరిష్కారం: తిరుపతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి తిరుపతి

**ఎల్.బి.నగర్,అక్టోబర్ 29 ప్రభాతవార్త:** లోక్‌అదాలత్ ద్వారా సులువుగా సమస్యలు పరిష్కారం అవుతాయని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి తిరుపతి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం ఆవరణలో లోక్ అదాలత్ కోఆర్డినేషన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి ఆర్.తిరుపతి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నవంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ గురించి పలు అంశాలపై చర్చించారు. లోక్ అదాలతో సామరస్యంగా పరిష్కరించుకో తగ్గ కేసులలో రాజీకి ఎక్కువ ఆస్కారం ఉంటుందన్నారు. క్రిమినల్, వివాహ, కుటుంబ తగాదాలు, చిట్ ఫండ్ కేసులు, ఎల్కట్రిసిటీ, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ కేసులు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పరిష్కరించుకోవాలని సూచించారు. పోలీసులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ.శ్రీదేవి, రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, జైలు అధికారులు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

# క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి హరీష్‌రావు పరామర్శ



మహ్మద్ అజారుద్దీన్‌ను పరామర్శిస్తున్న రాష్ట్ర మంత్రి హరీష్‌రావు, బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** హెచ్‌సిఏ అధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్‌ను శనివారం రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్‌రావు, టిఆర్ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డిలు పలువురు పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఇటీవల అజారుద్దీన్ తండ్రి చనిపోవడంతో ఆయన ఇంటికి చేరుకుని పరామర్శించారు. క్రికెటర్ అజారుద్దీన్‌తో తమకు ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు వేమూరి మహేష్‌గౌడ్, బైరి నవీన్‌గౌడ్, బోసాని పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మలక్‌పేట దళిత సేవా సంఘం అధ్యక్షుడిగా బాబు శ్రీనివాస్

**మలక్‌పేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** మలక్‌పేట దళిత సేవా సంఘం అధ్యక్షుడిగా బాబు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దళిత సేవా సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి శాయశక్తుల కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా బాబు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వేముల విజయ్‌కుమార్, బాబు రాజు, ప్రధాన కార్యదర్శిగా మహేందర్ మహరాజ్, కార్యదర్శులుగా తాటికొండ శ్యాం, విష్ణుదేవ్, కోశాధికారిగా కె.శంకర్, సలహాదారులుగా చౌకి రవికుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

# నల్లబ్యాడ్జీలతో గురుకుల ఉపాధ్యాయుల నిరసన



నిరసన ప్రదర్శిస్తున్న గురుకుల ఉపాధ్యాయులు

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాట సింగారం బీసీ గురుకుల పాఠశాలలో భోజన విరామ సమయంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల సమయాన్ని 9:00 గంటల నుండి 4.30కు మార్చాలని, అతిథి ఉపాధ్యాయులకు దసరా సెలవుల వేతనం, గురుకుల ఉపాధ్యాయుల పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాములయ్య, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షులు మహిపాల్ కరంటోత్, ఎంజెఎఫ్ గురుకులాల నాయకులు రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.